కథ

# కాలక్షేపం

– వలివేటి నాగచంద్రావతి



దేవుడిముందు దీపం వెలిగించి చిన్న బెల్లమ్ముక్కొకటి నైవేద్యమంటూ చెయ్యాలా చూపించి, "బామ్మా, ప్రసాదం పెట్టవా" అంటూ దగ్గరకొచ్చిన మనవరాలి చేతిలో ఓ పిసరు విదిల్చి మిగతాది నోట్లో వేసుకుంటూ సావిట్లోకొచ్చింది కామేశ్వరమ్మ.

గోడగడియారం పదిగంటలు చూపిస్తోంది. 'అబ్బ ఇప్పటికి తెమిలింది...' తెగ పాటుపడిపోయినట్టు మొహంపెట్టి గభాలున సోఫాలో కూలబడింది కామేశ్వరమ్మ. 'కాదు మరీ- ఎంత చాకిరీ, ఎంత చాకిరీ... అలసిపోయిందంటే పోదా మరి. ఆ కోడలు అపర్ణ ఉందంటే హాయిగా వంటా టిఫినూ చేసి పారేసి, టేబుల్‌మీద సర్ది పారేసి ఆమట్నా తొమ్మిదింటికల్లా ఎంచక్కా ఆఫీసుకంటూ ఎగిరిపోతుంది. ఇహ ఆ పనిమనిషి మాణిక్యమూ అంతే. చిటికెలో ఇల్లు ఊడ్చి తడిగుడ్డ పెట్టేసి, నిమిషాల మీద బట్టలుతికి ఆరేసి, అంట్లు తోమి బోర్లించి టింగురంగా అంటూ చెక్కాపోతుంది. ఒక్కక్షణం నుంచోమన్నా నుంచోదు.

'మీకేమమ్మా ఖాళీగా కూచోనుంటారు. నాకెట్టా కుదురుద్దీ' అంటుంది బడవ.'

అదిగో ఆ మాటే అస్సలు నచ్చదు కామేశ్వరమ్మకి. అప్పటికీ జనం తన్నలా అపార్థం చేసుకోకూడదని బిందెలో మంచినీళ్ళ గ్లాసు ముంచి ఇవ్వాల్సొచ్చినా చీరకుచ్చిళ్ళు పైకి దోపేసి పెద్దపని చేసొచ్చినట్టు అందరి ముందరా గొప్ప బిల్డప్ ఇస్తూనే ఉంటుంది పాపం. 'వీళ్ళ దుంపతెగ, అయినా ఎలా కని పెట్టేస్తారో ఏమిటో కదా!'

హుమ్మంటూ నిట్టూర్చి టీవీ రిమోట్ చేతికి తీసుకుంది కామేశ్వరమ్మ. ఆన్‌చేసి టక్కుటక్కుమంటూ ఛానల్స్ మార్చింది. దేన్లోనూ నచ్చిన ప్రోగ్రామే కనబళ్ళేదు. ప్చ్. ఇదివరకే నయం... ఈ టైముకి ఎంచక్కా అత్తాకోడళ్ళ సీరియళ్ళో, పగలూ ప్రతీకారాల సీరియళ్ళో వచ్చేవి' అనుకుంది బటన్‌నొక్కి, టీవీ ఆఫ్ చేస్తూ.

ఏం చెయ్యాలి ఇంక. సందువైపు కిటికీ దగ్గర కాసేపు నిలబడింది. వీధిగుమ్మంలో ఇంకాసేపు దిక్కులు చూసింది. ప్చ్, సిటీ సంస్కృతి... చుట్టుపక్కల అందరిళ్ళ తలుపులూ మూసే ఉన్నాయ్. ఒకటిరెండు తెరిచివున్నా ఎవరి మొహమూ కనబడ్డమే లేదు. పోనీ 'వదినగారూ' అనో, 'అక్కయ్యగారూ' అనో చొరవచేసి తనే వెళ్ళొచ్చునుగానీ ఈ ఇంట్లోకి మారి పదిరోజులన్నాకాలా. ఇంకా ఎవరితోటీ అంత పరిచయాలు అవలా. పైగా కొడుకు విశ్వం స్ట్రిక్ట్ వార్నింగ్ 'ఎవరింటికైనా వెళ్ళావో...' అని. ఎందుకలా అంటే- సరే, అది వేరే కథ.

'ప్చ్, ఖర్మ' మళ్ళీ నిట్టూర్చి వీధిగుమ్మంలోంచి లోపలికొచ్చింది కామేశ్వరమ్మ.

"బామ్మా, నాకా బొమ్మల బాక్సివ్వవ్" అడుగుతోంది మనవరాలు మంజు ఆవిడ చెయ్యి పట్టుకు కుదుపుతూ. ఒకటో తరగతి చదువుతున్న ఆ పిల్లకి పండగ సెలవులు. 'ఈ టైనాటీ ఒకత్తి. ఈ పిల్లని కాపలాకాసేపని లేకపోతే ఓ కునుకన్నా తీసుందును' విసుగ్గా అనుకుంటూ బొమ్మలపెట్టె తీసి మంజూకి అందించి మరోసారి టైము చూసింది.

పదిన్నర. గడియారం ఇంత నత్తనడక నడుస్తోందేం. ఈ లెక్కన సాయంత్రం అయ్యేసరికి పిచ్చెక్కేట్టుంది సుమా!

"ఆంటీ" పిలుపుతోపాటు వీధిగుమ్మం దగ్గర అలికిడి. తలెత్తింది కామేశ్వరమ్మ. గడపలో ఓ పద్దెనిమిదీ ఇరవైయేళ్ళ పడుచు.

ఇంకో మనిషి పొడ అపుపించినందుకు ప్రాణం లేచొచ్చినట్టుంది కామేశ్వరమ్మకి. ఆ ఉత్సాహంలోనే "రామ్మా రా, లోపలికి రా" అంటూ ఆహ్వానించింది.

మొహమాటపడుతూనే రెండడుగులు లోపలికి వేసిందా అమ్మాయి. పక్కింటివారి కోడల్నని పరిచయం చేసుకుంది. "అవునవును. పక్కింట్లో నిన్ను చూస్తూనే ఉన్నాను రోజూ" నిర్ధారించింది కామేశ్వరమ్మ.

"మరేంలేదు ఆంటీ, మా డాబా మీద ఆరేసిన బట్టల్లో మా మావగారి షర్టొకటి కనబడ్డంలేదు. ఒకవేళ గాలికేమన్నా ఎగిరి మీ పెరట్లో పడ్డదేమో కనుక్కుని రమ్మన్నారత్తమ్మ. ఏమీ అనుకోకుండా ఓసారి మీ పెరట్లో ఉందేమో చూడరా" ఎంతో నెమ్మదిగా నమ్రతగా అడిగిందా అమ్మాయి.

ముచ్చటేసింది కామేశ్వరమ్మకి. అమాయకంగా లేదుగానీ, లోకంపోకడలోని వంకరలూ మనుషుల నైజంలోని కోణాలూ ఇంకా తెలీనట్టూ, నీళ్ళు కలపని పాలలా ఉందా అమ్మాయి. 'తన కాలక్షేపానికి ఇలాంటివాళ్ళే కరెక్ట్‌గా కరెక్ట్' అనుకుంటూ ఇష్టంగా చూసిందా అమ్మాయిని.

"దానికేం భాగ్యం. అలాగే చూసొస్తాగానీ... అదేమిటలాగే నిలబడిపోయావ్..? దా, వచ్చి కూర్చో. అవునూ నీ పేరేమిటన్నావ్?" అనడుగుతూనే చెయి చాచి, ఆ అమ్మాయి రెక్కపట్టుకు కూర్చోపెట్టింది.

"నా పేరు మంగళ. ఇంకా ఇంట్లో పనవలేదు ఆంటీ. వెళ్ళిపోవాలి. అత్తమ్మ మిమ్మల్ని అడిగి వెంటనే వచ్చేయమన్నారు" అంది మంగళ అనబడే ఆ అమ్మాయి కాస్త ఇబ్బందిగా కూర్చుంటూ.

"మంగళ. ఎంతో శుభప్రదమైన పేరు. నువ్వున్నచోట సిరులకీ విజయాలకీ కొదవుండదనుకో" కళ్ళు మెరిపించింది మెచ్చుకోలుగా.

పొగడ్తకి పొంగనివారెవరు? మంగళ మొహం వికసించటం చూశాక అప్పుడు దగ్గరగా వచ్చి ఆత్మీయంగా పక్కన కూర్చుని లబ్జుగా విషయ సేకరణ మొదలుపెట్టింది కామేశ్వరమ్మ. "అవును. పదకొండు గంటలవుతోంటే ఇంకా పనవలేదా... ఏం పనిమనిషి లేదా? లేదూ... అనుకున్నాను. మరి ఇంట్లో పనంతా నీచేతే చేయిస్తుందా మీ అత్తగారూ... లేకపోతే అదేదో సామెతలోలాగా అమర్చిపెట్టినదాన్లో వేలు పెడుతుందా?" అంది వేళాకోళం జోడించి.

"అబ్బే, అదేంలేదండీ... ఆవిడ కూడా నాతోపాటు చేస్తూనే ఉంటారు పని" తత్తరపడింది మంగళ.

"అమ్మో, అత్తగారి మీద మాటపడనివ్వవేం. మంచిదానివే" అని నవ్వి, "నిన్ను చూస్తే నా మనవరాలిని చూసినట్టే ఉంది" అంటూ, మంగళ మంజు వైపు చూద్దం చూసి, "ఈ బుడంకాయ కాదులే. అది నా కూతురి బిడ్డ. ఇప్పుడీ దేశంలో లేదు. పెద్ద చదువు చదవటానికి పైదేశం వెళ్ళింది. విద్యల్లో సరస్వతీదేవే అనుకో. నీ మొహంలోనూ అదే కళ. నిన్ను చూడగానే నా కళ్ళకి పండగొచ్చినట్టయింది."

మంగళ మొహం ఉదాసీనమయింది.

"నాకూ చదువుకోవటమంటే చాలా ఇష్టం

66

అంటే. కానీ..." బాధగా అంది మంగళ. తన తరవాత ముగ్గురు తోబుట్టువులట. తండ్రి సామాన్యుడు. టెన్త్‌తో చదువు ఆపించాడు. ఆర్నెల్లక్రితం పెళ్ళయిపోయింది.

"ప్చ్..." విచారం వెలిబుచ్చింది కామేశ్వరమ్మ. "నిన్ను చూసినప్పుడల్లా అనిపిస్తుంది... హాయిగా ఏ బాదరబందీ లేకుండా స్వేచ్ఛగా సీతాకోకచిలకలా ఉండాల్సిన వయసు. ఇలా సంసారంలో చిక్కుకుని బక్కెట్లు మోస్తూ, బట్టలు ఉతుకుతూ అత్తగారి అరుపులూ అరళ్ళూ భరిస్తూ పంజరంలో చిలకలా... ..." జాలితో మాటలు రావటంలేదన్నట్టుగా ఆపింది కామేశ్వరమ్మ.

ఆవిడలా అయాచితంగా అభిమానం కురిపిస్తుంటే ఇందాకట్లా 'అంత సీనేంలేదు' అని అడ్డుచెప్పబుద్ధి కాలేదు మంగళకి. అదీగాక అత్తగారనంగానే సహజంగానే కొద్దో గొప్పో వ్యతిరేకభావం ఉంటనే ఉంటుందయ్యె.

"మంగా" అత్తగారి కేక.

మంగళ చేతికి పెరట్లోంచి తెచ్చిన షర్టందిస్తూ "మంగా ఏమిటే, తుంగలాగా. నిక్షేపంలాంటి మంగళ అన్న పేరు పెట్టుకనీ..." మూతి విరిచింది కామేశ్వరమ్మ.

హడావుడిపడుతూ పరిగెత్తింది మంగళ.

ఆరోజు సోమవారం.

★ ★ ★

మర్నాడు అదే సమయం. పెరట్లో నాలుగువైపులా వెతుక్కుంది కామేశ్వరమ్మ... పక్కవాళ్ళ వస్తువేదయినా పడి ఉండొచ్చుగదా అని. అలాంటిదేమీలేదుగానీ అదృష్టవశాత్తూ ఆవిడక్కావాలిసిన శాల్తీ పక్క డాబా మీద కనబడింది. వడియాలపిండి చేత్తో ముంగురులు వెనక్కి తోసుకుంటూ పిట్టగోడ దగ్గర నిలబడుంది మంగళ. ఈవిణ్ణి చూసి నవ్వింది పలకరింపుగా. రమ్మన్నట్టు చేత్తో సైగ చేసింది కామేశ్వరమ్మ.

గంట తరవాత ఎంటరయ్యింది కామేశ్వరమ్మ ఎదరకి మంగళ.

"ఎండలా మండిపోతోంటే మేడమీద వడియాలు పెడుతున్నావా... అయ్యో అయ్యో, మొహమెలా కమిలిపోయిందో చూడు" అంటూ లేని చెమటని పమిట కొంగుతో అద్ది... "అవునూ, నిన్నిట్లా మాడబెట్టి మీ అత్త మహారాణులుంవారు ఏం చేస్తున్నారట! కూలరు వేసుకుని విశ్రాంతి తీసుకుంటున్నారటా..." అంది దీర్ఘం తీస్తూ.

ఆవిడ చూపుతోన్న ఆదరణకి పులకించిపోయి సానుభూతికి వెటకారం జోడించిన ఆవిడ ధోరణికి చిరునవ్వు నవ్వింది మంగళ. "లేదాంటే, అత్తమ్మకి మోకాళ్ళనొప్పులు. మెట్లెక్కలేదు" అంది.

"అవునవును. మంగలాళ్ళే చూసి ఎద్దు కాలు కుంటిందనీ - ఎదుటివాళ్ళు మెత్తమెత్తగా అవుపడుతుంటే లేని నొప్పులన్నీ అలాగే బయటకొస్తాయ్ ఎవర్తికైనా. నేనన్నానని కాదుగానీ కోరలివి కాబట్టి నిన్నింత ఎండలో పైకి పంపగలిగిందిగానీ అదే కూతురయితే పంపునా... ఇదే మరి వలపక్షం అంటె. పిచ్చిపిల్లవి నీకేం తెలుసు... అమ్మా అత్తా ఒకటేననుకుని ఒళ్ళు విరుచుకుంటున్నావ్. ఈ రకంగా మెతకదనం చూపించావంటే ఆనక అన్ని పన్లూ నీ నెత్తికెత్తి నడ్డి విరిచేస్తుంది మీ అత్త" తన మాటలు వింటోందా లేదా అని ఓ క్షణం ఆగి, పరవాలేదు బుర్రపెడుతోంది అనిపించాక, "నీ మేలుకోరి చెబుతున్నానే తల్లీ. కాస్త నువ్వూ గడుసుతనం నేర్చుకో. ఎంతసేపూ నువ్వే విరిగి ముక్కలవక, కొన్ని పనులు నాకు చేతకావను, తెలివిగా ఆలోచించి తప్పించుకుంటూ ఉండు."

పావుగంటసేపు ఇలాంటివే ఏవేవో చిట్కాలు, యుక్తులు... భక్తిగా వింది మంగళ. నెమరు వేసుకుంటూ ఇంటికి వెళ్ళింది.

ఆరోజు మంగళవారం.

★ ★ ★

అప్పుడే ఆఫీసునించొచ్చి జోళ్ళు విడుస్తున్న



అపర్ణతో "వచ్చావా తల్లీ... పొద్దుట్నుంచీ *నీ కూతురితో వేగివేగి నీరసమొచ్చిందనుకో.* ముందు నాక్కాస్త టీ పెట్టిద్దూ" అని పురమాయించి, మంజు చేసిన ప్రతి చేష్టా గొప్ప నేరంగా వర్ణిస్తూ చెప్పేలోపల చేతికి టీ కప్పొచ్చింది. అది పుచ్చుకుని వరండాలో కొచ్చింది కామేశ్వరమ్మ.

సరిగ్గా అప్పుడే మంగళ అత్తగారు శ్యామలాంబగారు వీళ్ళ ఇంటిముందు నుంచి వెళ్తూ కామేశ్వరమ్మని చూసి ఆగి చిరునవ్వు నవ్వింది. "మీరొచ్చినప్పట్నుంచీ పరిచయం చేసుకుందాం వెళ్ళి అనుకుంటాను... కుదిరింది కాదు" అంది.

కొత్త స్పెసిమన్‌ని చూసిన సైంటిస్టులా వెలిగిపోయింది కామేశ్వరమ్మ మొహం. "రండి, రండి" అంటూ ఆహ్వానించింది.

"జనార్దనస్వామి కోవెల్లో దేవీ మహాత్మ్యం పురాణం చెబుతున్నారు. అక్కడకని బయల్దేరాను. మరోసారి వస్తాను. ఏమనుకోకండే" అని, "పోనీ పని అయిపోతే మీరూ *నాతోపాటు రాకూడదూ... దగ్గరే. గంటలో* వచ్చేయొచ్చును" అంది.

కామేశ్వరమ్మ అపర్ణ వైపు చూసింది. క్షణం తటపటాయించినా "దేవాలయ సందర్శనం. ప్రవచనంలోని సుభాషిత శ్రవణం. మంచి కాలక్షేపమే కదా. వెళ్ళిరండి" అంది అపర్ణ.

పాపం పిచ్చి అపర్ణ, ఎంత అమాయకురాలో..! గుడికి వెళ్తే దేవుణ్ణే తలుచుకుంటూ కూర్చోవాలని ఏమన్నా రూలా. ఎవరి ఇష్టం వాళ్ళది... కామేశ్వరమ్మ తీరు కామేశ్వరమ్మదీ! శ్యామలాంబతోపాటే గుడికి వెళ్ళిందా... ఆవిడతోపాటే ప్రదక్షిణాలూ నమస్కారాలూ పూర్తిచేసిందా... ఆవిడతోపాటు పురాణం చెబుతున్న మండపంలో స్థిరపడిందా... అంతే. ఆ తరవాత శ్యామలాంబతోపాటూ కథలో లీనమవటం మాత్రం కామేశ్వరమ్మ వల్లకాలేదు.

ఓ పావుగంటసేపెలాగో ఓపిక చేసుకు కుదురుగా కూర్చోగలిగింది. ఆ తర్వాత చెవులకి ఆ ప్రవచనమూ వినబళ్ళేదు... కళ్ళకి ఆ చెప్పే శాస్త్రిగారూ కనబళ్ళేదు. 'ఉహూ, లాభంలేదు. పొజిషన్ మార్చాల్సిందే' మెల్లగా పక్కకి తిరిగి, స్వరం తగ్గించి "అక్కయ్యగారూ..." అంటూ శ్యామలాంబని మాటల్లోకి దింపేసింది.

స్తంభానికానుక్కూర్చోవచ్చునని అందరికీ కాస్త వెనకన ఎడంగా కూర్చోవడం మంచిదయింది... "ఇష్షు" అంటూ పక్కవాళ్ళు మొహం చిట్లించుకోకుండా.

శ్యామలాంబ కూడా మొదట 'పురాణం వినటానికి వీలవకుండా ఉందే' అని కాస్త అయిష్టంగా ఉండి, ఆవిడ చెప్పేవాటికి 'ఊ ఊ' అని ఊకొట్టి ఊరుకుందిగానీ మెల్లమెల్లగా తనూ మాటల్లోకి దిగిపోయింది. ఊసుపోక కబుర్లకున్న అయస్కాంత శక్తే అది. అందులోనూ కామేశ్వరమ్మ చెప్పే ఊసులకీ ఉపదేశాలకీ మరీ రుచెక్కువ. అయిదు *నిమిషాలపాటు ఎవరితోనైనా మాట్లాడిందంటే* వాళ్ళు 'ఈవిడ నా శ్రేయోభిలాషి' అనుకుని తీరాల్సిందే!

"ఇంట్లో వంట మీ కోడలే చేస్తుందా అక్కగారూ!" సాధారణంగా అడిగినట్టడిగి, "అచ్చే, దాని మొహం. చిన్నపిల్ల. అప్పుడే దాని చేతికి గరిటెక్కడ అప్పగించను! నేనే చేస్తాను. నా చేతికింద అదీ ఇదీ అందిస్తూ ఉంటుందంతే" అన్న శ్యామలాంబ సమాధానం పట్టుకుని ఇక తనదైన తరహా బోధన మొదలుపెట్టేసింది.

"అయితే కోడలికి కూడా కూచోపెట్టి వండి పెడతారన్నమాట. ఎంత మంచితనమండీ మీది" అని పొగిడి, అంతలోనే మొహం అదోలా మార్చి, "కానయితే ఒక్క విషయం గుర్తుపెట్టుకోండక్కగారూ, పెద్దదాన్నో చిన్నదాన్నో అనుభవంకొద్దీ చెప్తున్నాను. మొక్కయి ఒంగనిది మానయి ఒంగుతుందా అనీ... మీరిప్పుడు కోడల్ని పసిపిల్లా బుజ్జిపాపాయీ అంటూ గారాంచేసి *బుజ్జగించిదిరా అనక ఏకు మేకై మొండికే* య్యొచ్చును. అవసరానికి ఇది చెయ్యమ్మా

అంటే చెయ్యలేననవచ్చును. చేతకాదని తప్పించుకోవచ్చును. అదీఇదీ కాదని ముసుగు తన్ని పడుకోనూ వచ్చును. ఆ ఆటలలాగే సాగనిచ్చారంటే మెల్లమెల్లగా మిమ్మల్ని పనిమనిషిని చేసేస్తుంది. యజమానురాలి హోదా ఆ కోడలుపిల్లే దక్కించుకుంటుంది. ఆc... మరేమనుకుంటున్నారో. అందుకనీ నే చెప్పేదేమిటంటే మీరిప్పట్నుంచీ జాగ్రత్తపడమని. కోడల్ని చేయిదాటి పోనీకుండా అదుపూ ఆజ్ఞలో పెట్టుకోండి. లేకపోతే ఆ తర్వాత చాలాచాలా విచారించాల్సొస్తుంది సుమా."

శాస్త్రిగారి ప్రవచనం పూర్తయింది. కామేశ్వరమ్మ స్వవచనమూ పూర్తయింది.

ఆరోజు బుధవారం.

★ ★ ★

ద్వితీయ విఘ్నం కానీయకుండా మర్నాడు శ్యామలాంబ కామేశ్వరమ్మ దర్శనం చేసుకుంది. ఇంకాసిని సలహాలూ సూచనలూ స్వీకరించింది.

"మా కోడల్నే చూడండి... ఉద్యోగం చేస్తున్నా సరే, రోజూ వంటపనీ ఇంటిపనీ పూర్తిచేసి మరీ వెళ్ళాల్సిందే. లేకపోతే నేనూరుకోను. ఆc..." చూశారా నా ప్రతాపం అన్నట్టుగా గర్వంగా అంటున్న కామేశ్వరమ్మని చూసి తెగ ఇంప్రెస్ అయిపోయింది శ్యామలాంబ. ఉత్సాహంగా తిరిగివెళ్ళింది.

ఆరోజు గురువారం.

★ ★ ★

"ఇల్లు దాటొద్దని చెప్పానా... నిన్ను పట్టుకోలేక నా దుంపతెగుతోందే భడవా. ఈసారి గుమ్మందాటు చెబుతాను... వీపు చీరేస్తాను, కాళ్ళు విరిచేస్తాను" శిక్ష వేసేముందు సెక్షన్లు చదువుతున్న జడ్జి ముందర బోనులో నిలబడ్డ ముద్దాయిలా బిక్కమొహంవేసి నుంచున్న మంజుని క్రమశిక్షణలో పెడుతోంది కామేశ్వరమ్మ.

"ఏం చేస్తున్నారాంటీ..." చేతిలో చిన్నగిన్నె పట్టుకుని లోపలికొచ్చింది మంగళ.

"నువ్వా, రా రా... మరీ నల్లపూసవయినావేం?" కామేశ్వరమ్మ మొహం ఇంతయింది.

"ఏం చెయ్యమంటారాంటీ, మొన్నట్నుంచీ అదోలా ఉంటున్నారత్తమ్మ. ఒక పని తరవాత ఇంకొక పని అప్పగిస్తూనే ఉన్నారు. తను చేసే పనులు కూడా నాతోనే చేయిస్తున్నారు. ఒక్కక్షణం ఖాళీగా ఉండనివ్వడం లేదు" తీసుకొచ్చిన ప్రసాదం గిన్నె ఆవిడ చేతికిస్తూ ఉస్సురంది మంగళ.

"నేను ముందే చెప్పలా, ఇలాగే అవుతుందనీ..." పైకి కనబడనీయలేదుగానీ తను నాటిన విత్తనం మొలకెత్తినందుకు మహా సంబరంగా ఉంది కామేశ్వరమ్మకి.

నిట్టూర్చింది మంగళ. "ఇవ్వాళ్టికివ్వాళ ఏదో లక్ష్మీదేవి వ్రతమట... రాత్రిదాకా కటిక ఉపవాసం అంటూ పొద్దున్నే మడికట్టుకు కూర్చున్నారత్తమ్మ. ఒక్క పని ముట్టుకోలేదు. చేసీచేసీ ఒళ్ళు హూనమయిపోతోంది నాకు" అంది మరోసారి నిట్టూరుస్తూ.

"ఏమిటీ, మీ అత్తగారివాళ ఉపవాసముందా? మరిందాక కిటికీ దగ్గర నుంచునీ నోరాడించటం చూశానే. కాగితం నలిపి గోడమీదగా గిరాటేసింది కూడానూ..." అగ్గిపుల్ల వెలిగించింది కామేశ్వరమ్మ.

"నిజంగానా?" తెల్లబోయి అపనమ్మకంగా చూసింది మంగళ.

"ఏమోలే, ఏం చూసి ఏమనుకున్నానో... వదిలెయ్" అనుమానం రాజేసి, అవునో కాదో నువ్వే డిసైడ్ చేసుకో అన్నట్టు సందిగ్ధంలో పడేసి, "ఇంతకీ ఏం చేద్దామనుకుంటున్నావ్?" అనడిగింది విషయాన్ని మొదటికి తెస్తూ.

"నేనేం చెయ్యగలనాంటీ" బేలగా అంది మంగళ.

"మరే, నువ్వేం చెయ్యగలవులే. ఒళ్ళు పులిసిపోయినా మాత్ర వేసుకుని మంచ మెక్కడం రాదు. మాటకు మాట అంటించనూ లేవు. ఇంకేం చేస్తావ్... నా దగ్గరకొచ్చి చెప్పుకుని కాసేపు ఏడ్చుకుని వెళ్ళు కాస్త బాధన్నా తగ్గుతుందేమో."



రోషంగా చూసి లేచింది మంగళ.

ఆరోజు శుక్రవారం.

★ ★ ★

నిన్నటివరకూ ప్రశాంతంగా ఉన్న ఆ ఇల్లివ్వాళ రణరంగాన్ని తలపిస్తోంది. కొత్తవాళ్ళు తల్లీకూతుళ్ళని భ్రమపడే విధంగా ఉండే ఆ ఇంటి అత్తాకోడళ్ళు పొద్దుట్నుంచీ మాటల యుద్ధం చేస్తున్నారు.

ఉత్త వెర్రిబాగులదాన్నిచేసి అత్త తననెలా ఆడించిందో, ఎలా వాడుకుందో, దాసీదానిలాగా ఊడిగమెలా చేయించుకుందో ఏడుపు గొంతుతో ఉక్రోషం వెళ్ళగక్కుతోంది కోడలుపిల్ల.

ఈ ఇల్లు మెట్టిన దగ్గర్నుంచీ కోడలు ఎన్ని చేయరాని నేరాలు చేసిందో వాటిని తనెలా కడుపులో పెట్టుకు దాచుకుందో, ఎన్ని పల్లదనాలను చిన్నతనం లెమ్మని పెద్దమనసుతో ఓర్చుకుందో రూక్షంగా ఏకరువు పెడుతోంది అత్తగారు.

చివరికి "ఆవిడ చెప్పనే చెప్పింది... నీలాటి వాళ్ళని కాలికిందే అణిచి ఉంచాలని. పోనీలే పాపం అని దయతలిస్తే దొంగ ఎత్తులువేసి ముసుగుతన్ని మూలుగుతారని..." అంటూ ఆగని కోపాన్ని వెళ్ళగక్కేసింది శ్యామలాంబ.

"ఏమిటీ... నిన్న చేసిన చాకిరీకి రాత్రంతా జ్వరమొచ్చినట్టయి పొద్దున్నే లేవలేకపోతే నాది దొంగ ఎత్తులా? మరి నిన్న ఉపవాసమని గొప్ప కబుర్లు చెప్పి ఎవరూ చూడకుండా కడుపునిండా పేసుకుంటే దాన్నిమటుకు దొంగతిండి అనరా?" రెట్టించింది మంగళ అత్తగారికి తీసిపోకుండా.

"ఎవరా అన్నది?"

"ఎవరా చెప్పింది?"

మరుక్షణం ఉగ్రరూపాలతో కామేశ్వరమ్మ ముందున్నారు.

"అయ్యో అయ్యో, ఇదేమన్యాయం? లోకంలో ఎక్కడైనా ఉందా ఇంత దారుణం? ఉరుమురిమి మంగలం మీద పడిందనీ అత్తాకోడళ్ళిద్దరూ కీచులాడుకునీ నెపం నామీదకి నెట్టేస్తున్నారా? ఇది మరీ బాగుందే" వీళ్ళకి సాక్ష్యం ఉందా ఏమన్నానా అన్న దిలాసాతో దబాయించింది కామేశ్వరమ్మ.

కానీ పాపం ఆవిడ అనుకున్నది కాస్తా తల్లకిందులు చేశాడా దైవం. "అదేంటి బామ్మా, నువ్వేగా నిన్న చిన్న ఆంటీతో చెప్పావ్, టాబ్లెట్ వేసుకుని బజ్జోమని. అప్పుడే మరిచిపోయావ్. మరేమో ఈ పెద్దాంటీ కిటికీ దగ్గర నుంచునీ ఏదో తింటోందని కూడా చెప్పావ్‌గా. దొంగా, అబద్ధాలాడుతున్నావా?" అంతవరకూ అక్కడే బొమ్మల్తో ఆడుకుంటున్న మంజు హఠాత్తుగా ఇటు తిరిగి వాళ్ళ బామ్మకేసి వేలు ఆడిస్తూ నవ్వింది.

ఇక చెప్పేందుకేముంది. బ్రహ్మాండం బద్దలయింది. అరగంట సేపక్కడ ఉరుములూ మెరుపులూ.

ఒకరు మార్చి ఒకరు దుమ్ముదులిపేస్తున్న శ్యామలాంబా, మంగళా.

మింగలేక కక్కలేక సందు దొరికితే పారిపోదాం అన్నట్టుగా నుంచున్న కామేశ్వరమ్మ.

బిక్కమొహం వేసి ఆవిడ కొంగుపట్టుకున్న మంజు...

'ఇలాంటివాళ్ళు ఊక్కో ఒక్కరుంటే చాలు, ఇళ్ళకి వేరే నిప్పెట్టక్కర్లేదు', 'వయసు పెద్దదవటం కాదు, బుద్ధికి పెద్దరికం రావాలి', 'ఇలాంటివాళ్ళనీ...' ప్రత్యక్షంగా జాయినవకపోయినా గోడలమీంచీ కిటికీ వెనకాలనుంచీ తొంగిచూస్తోన్నవాళ్ళ వినీవినిపించని కామెంట్లు...

హాఫ్‌డే మూలంగా అపర్ణా, విశ్వం ఆ మధ్యాహ్నం ఆఫీసు నుంచి వచ్చేవేళకు అదీ సీను.

ఆరోజు శనివారం.

★ ★ ★

ఆదివారం... తెల్లారింది.

"హలో రెంటల్ ఏజన్సీస్ రామ్మూర్తిగారేనా, నేను విశ్వనాథ్‌ని. మాకు రెంట్‌కి ఇల్లు కావాలి వెంటనే."

"అరే, మీకిల్లు చూపించి నెల కూడా కాలేదు కదండీ. ఈసారి మరీ తొందరగా మారిపోతున్నారే. మీకక్కడ ఏమిటీ ప్రాబ్లమ్?"

క్షణకాలం మౌనం తరవాత "మా అమ్మగారికక్కడ కాలక్షేపం పూర్తయిపోయింది" ఫోన్ పెట్టేశాడు విశ్వం.

★